

డీఎస్సీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

కరీంనగర్ టౌన్, జూలై 13: జిల్లాలో డీఎస్సీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు పరీక్షా కేంద్రాల్లో ఈ నెల 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు పరీక్షలు ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తామన్నారు. అల్ఫోర్స్ డిగ్రీ, పీజీ కళాశాల సీతారాంపూర్, జగిత్యాల రోడ్డు, ఐయాన్ డిజిటల్‌జోన్ వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల ఎల్ఎండీ కాలనీ, కమలా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ (కిమ్స్) సింగపూర్, హుజూరాబాద్, వాణినికేతన్ డిగ్రీ, పీజీ కళాశాల, టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్, జ్యోతినగర్, వివేకానంద డిగ్రీ /పీజీ కళాశాల,జగిత్యాల రోడ్, వావిలాలపల్లిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీకి ముందస్తు ప్రయత్నాలు

- బీఆర్ఎస్‌లో ఆశావహుల జోరు
- తెరపైకి వినోద్‌కుమార్, బీఎన్‌రావు, రవీందర్‌సింగ్ పేర్లు
- పట్టించుకోని ఇతర పార్టీలు



బోయినపల్లి వినోద్‌కుమార్



డాక్టర్ బీఎన్ రావు



సర్దార్ రవీందర్‌సింగ్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగడానికి మరో ఎనిమిది నెలల గడువు ఉంది. బీఆర్ఎస్‌లో ఆ ఎన్నికల గురించి హడావుడి ప్రారంభం కావడం రాజకీయ వర్గాలలో ఆశ్చర్యం కలిగిస్తున్నది. రోజుకో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పార్టీని వీడుతూ కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు. ఈ రాజకీయ వలసలను ఆపేదెలా అంటూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం తలపట్టుకుంటుండగా కొత్తగా ఎమ్మెల్సీ కావడానికి ఆ పార్టీలోనే కొందరు నేతలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవడం చూసి అందరూ ఆశ్చర్య పోతున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీలో ఆ ఎన్నికల ఊసే ఎవరూ ఎత్తడం లేదు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గానికి 2019 మార్చిలో ఎన్నికలు జరిగాయి.

2025 మార్చి 29వ తేదీ వరకు ప్రస్తుత ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి పదవిలో ఉంటారు. ఆయన పదవీ కాలం ముగిసే సరికి ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉన్నది. నాలుగు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఉన్న పట్టభద్రులను కలుసు కోవడం వారికి తమ రాజకీయ ఆలోచనలను కార్యాచరణను వివరించి ఓట్లు అడగాల్సి ఉన్నందున ఇప్పటి నుంచే ఆ ప్రయత్నాల్లో ఉంటే బాగుంటుందని కొందరు ఆశావహులు ముందస్తు ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు.వారంతా బీఆర్ఎస్‌కు చెందిన వారు కావడం రాజకీయంగా చర్చకు తెర తీసింది.

అవకాశం ఎవరికో?

➡ రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఐఎంఏ నాయకులు డాక్టర్ బీ నరేందర్‌రావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ రవీందర్‌సింగ్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. సోషల్ మీడియాలో వారం రోజులుగా బి వినోద్‌కుమార్ ఎమ్మెల్సీ పదవికి అర్హుడని ఆయనకు జిల్లా, రాష్ట్ర పరిస్థితులపై రాజకీయాలపై అభివృద్ధిపై సమగ్ర అవగాహన ఉందని, ఆయన ఆలోచనలు విజన్ మరింత అభివృద్ధికి దోహదం చేస్తాయని పేర్కొంటూ పోస్టులు వచ్చాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఆయన సరైన అభ్యర్థి అంటూ చర్చకు తేవడం వెనుక బీఆర్ఎస్ అధినేత ఆమోదం కూడా ఉండవచ్చని పలువురు చర్చించుకుంటున్నారు. వినోద్‌కుమార్ పోటీ చేయాలని భావిస్తే అధినేత కేసీఆర్ అభ్యంతరం పెట్టరని, ఎంత మంది పోటీకి వచ్చినా ఆయనకే పోటీ చేసే అవకాశం లభిస్తుందని అంటున్నారు. మరో వైపు ఎమ్మెల్సీ స్థానానికి వినోద్‌కుమార్ పోటీ చేయరనే విషయాన్ని కొందరు ప్రచారంలోకి తెస్తున్నారు.

➡ బీఎన్‌రావు ఏడాది కాలంగా మేధావి వర్గాలతో, ప్రజా సంఘాలు, వృత్తి సంఘాల నాయకులు విద్యావేత్తలు, అడ్వకేట్లు, డాక్టర్లతో సంప్రదింపులు జరుపుతూ ఆయా సంఘాల ద్వారా సామాజిక, సంక్షేమ వైద్య ఆరోగ్య కార్యక్రమాలను చేపడుతూ వస్తున్నారు. ఆయన సొంతంగా ఒక స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గంలో ఉన్న నాలుగు జిల్లాల్లో ఆయన ఇప్పటికే మూడు జిల్లాల్లో తన కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ఇటీవలి కాలంలో పలు చర్చా వేదికలు ఏర్పాటు చేసి కాళేశ్వరం ప్రాజెక్టు అంశంతో పాటు మరికొన్ని సామాజిక అంశాలపై ప్రజల్లోకి ఒక సందేశం పంపేలా కార్యక్రమాలు నిర్వహించారు. వీటన్నింటి వెనుక ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచన ఉందని, బీఆర్ఎస్ అవకాశం కల్పిస్తే ఆయన పోటీ చేస్తారని సమాచారం.

➡ చర్చల్లో ఉన్న మరో వ్యక్తి సర్దార్ రవీందర్‌సింగ్. కరీంనగర్ మేయర్‌గా పనిచేసిన ఆయన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నమ్మిన బంటు. కరీంనగర్ అసెంబ్లీ టికెట్‌ను ఆశించిన ఆయన అది లభించని నేపథ్యంలో 2022లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ టికెట్‌ను కోరుకున్నారు. అది కూడా ఆయనకు అందని ద్రాక్షే అయింది. దీంతో ఆయన తిరుగుబాటు చేసి ఇండిపెండెంట్‌గా ఆ ఎన్నికల్లో పోటీ చేసి ఆనాటి అధికార బీఆర్ఎస్ పార్టీతోపాటు ఇతర అభ్యర్థులకు గట్టి పోటీని ఇచ్చి సవాల్‌గా నిలిచారు.

ఆ ఎన్నికల్లో ఆయనకు విజయం దక్కలేదు. ఫలితాలు వెలువడిన వెంటనే ఆయనకు కేసీఆర్ ఆహ్వానం పంపారు. ఆయన కేసీఆర్‌ను కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఆయనకు సివిల్ సప్లయీస్ కార్పోరేషన్ ఛైర్మన్ పదవిని కేసీఆర్ కట్టబెట్టారు. ఆ పదవిలో ఇటీవల వరకు కొనసాగిన ఆయన ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేయాలనే ఆలోచనతో ఉన్నారని తెలిసింది. ఈ ముగ్గురితోపాటు కేసీఆర్ కుమార్తె కవిత పేరు తెరపైకి వస్తున్నా ఆమె కేసులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అట్లాంటి ఆలోచన చేయరని, అధినేత అందుకు అంగీకరించక పోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీని వీడుతూ కాంగ్రెస్‌లో చేరుతున్న తరుణంలో బీఆర్ఎస్‌లో ఆందోళనలు చోటు చేసుకుంటుండగా ఇక్కడ పోటీకి ఆసక్తి చూపిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

మంగళ, శుక్రవారాల్లో డ్రై డేగా పాటించాలి

సుభాష్‌నగర్, జూలై 13: ప్రతి వారంలో మంగళ, శుక్రవారాల్లో డ్రై డే పాటించాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ అన్నారు. శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాతతో కలిసి నగరంలోని బుట్టిరాజారాం కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్, పోలీస్ ట్రైనింగ్ సెంటర్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా, దోమలు అభివృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డెంగ్యూ ప్రబలకుండా ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడేను పాటించాలన్నారు. ఇళ్లు, ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలువలను తొలగించాలన్నారు. కూలర్లు, ఫ్రిడ్జ్ ట్రేలు, కొబ్బరి బోండాలు, పాడై పోయిన పాత్రలు, టైర్లు మొదలుగు వాటిల్లో నీళ్ల నిలిచి దోమలు అభివృద్ధి చెందుతాయన్నారు. వాటిలో నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరం వచ్చినపుడు వెంటనే సమీపంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా ఆశా కార్యకర్తను సంప్రదించి రక్త పరీక్ష చేసుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే మందులు వాడాలన్నారు.



శాతవాహన యూనివర్సిటీకి రూ. 100 కోట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

గణేశ్‌నగర్, జూలై 13: శాతవాహన యూనివర్సిటీకి 100 కోట్లు కేటాయించాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ జెల్లపెల్లి అంజన్న డిమాండ్ చేశారు. శనివారం ఆయన కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీని ప్రభుత్వ పట్టించుకోక పోవడం వల్ల అభివృద్ధి చెందలేదన్నారు. యూనివర్సిటీలో మౌలిక వసతులు కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు. శాతవాహన యూనివర్సిటీలోని 12 కోర్సుల్లో ఎనిమిది కోర్సులను సెల్ఫ్ ఫైనాన్స్‌గా మార్చడంవల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి యూనివర్సిటీలోని కోర్సులను రెగ్యులరైజ్ చేయాలి, కొత్త కోర్సులను ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాలుగా పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయక పోవడంతో నెట్, సెట్ క్వాలిఫై అయిన విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. హాస్టల్స్‌లో రూములు సరిపోక ఒక్కొక్క రూములో ఆరుగురు విద్యార్థులు ఉంటున్నాన్నారు. సమావేశంలో ఏబీవీపీ కార్యకర్తలు మల్లేష్, రమేష్, సాగర్ పాల్గొన్నారు.

నామమాత్రంగా జంక్షన్ల అభివృద్ధి

నాలుగోసారి మరమ్మతులకు నిధులు



జమ్మికుంట గాంధీ చౌరస్తా

జమ్మికుంట, జూలై 13: జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా జంక్షన్ వద్ద నామమాత్రంగా పనులు చేపట్టడంతో తరచుగా మరమ్మతులు చేయాల్సి వస్తోంది. దీంతో ప్రజాధనం వృథా అవుతోందని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. ఏర్పాటు చేసి రెండేళ్లు గడవక ముందే గాంధీ చౌరస్తా జంక్షన్ చుట్టూ ఉన్న రెయిలింగ్ ధ్వంసం అయింది. నాసిరకంగా ఉన్న రెయిలింగ్ కొద్ది రోజులుగా ఒక పక్కకు ఒరుగుతోంది. ఇటీవల గుర్తు తెలియని వాహనం తాకడంతో పూర్తిగా నేలకొరిగింది. గాంధీ చౌరస్తా జంక్షన్ అభివృద్ధి కోసం 2022 సంవత్సరంలో 25 లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఆ నిధులతో రెయిలింగ్ లోపల మొక్కలు, వాటర్ ఫౌంటేన్, రంగు రంగుల విద్యుత్ బల్బులు అమర్చారు. ప్రారంభంలో కొద్ది రోజులు నడిచిన వాటర్ ఫౌంటేన్ తర్వాత ఆగి పోయింది. చుట్టూ తేలికపాటి రెయిలింగ్ పెట్టడంతో గాలి దుమారాలు వచ్చిన సమయాల్లో దెబ్బతింటోంది.

● **ఎనిమిదేళ్లలో మూడు సార్లు మార్పులు**

జమ్మికుంట గాంధీ చౌరస్తా జంక్షన్ డిజైన్లను ఎనిమిదేళ్లలో మూడు సార్లు మార్చారు. 2015లో మూడు లక్షలు, 2018లో 10 లక్షలు, 2022లో 25 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేశారు. ఎనిమిదేళ్లలో 38 లక్షలు ఖర్చు చేశారు. నాసిరకం పనుల వల్ల ప్రతి నాలుగేళ్లకు ఒకసారి లక్షల రూపాయలు వెచ్చించి జంక్షన్ డిజైన్ మారుస్తూ వస్తున్నారు. తాజాగా జంక్షన్ మరమ్మతుల కోసం ఐదు లక్షల నిధులు విడుదల చశారు. నాలుగో సారి అయినా మరమ్మతు పనుల్లో నాణ్యత పాటిస్తారా అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



ధ్వంసం అయిన జంక్షన్ రేలింగ్

ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లకు జరిమానా

కరీంనగర్ టౌన్, జూలై 13: నగరంలోని నిబంధనలు పాటించని ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్స్ సెంటర్ల అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ కుమార్ దేశాయ్ భారీ జరిమానాలు విధించారు. కేసీ డయాగ్నోస్టిక్ సెంటర్, భూంరెడ్డి హాస్పిటల్, గంగా హాస్పిటల్‌లో తనిఖీ నిర్వహించారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణను పరిశీలించారు. నిబంధనలకు వ్యతిరేకంగా బయోవ్యర్థాలను మున్సిపల్ వ్యర్థాలతో కలిపి మున్సిపల్ సిబ్బందికి అందించాడాన్ని గుర్తించి నోటీసులు జారీ చేశారు. మూడోసారి నిబంధనలు ఉల్లంఘించినందుకు జరిమానాలు విధించారు. కేసీ డయాగ్నోస్టిక్స్‌కు లక్ష రూపాయలు, భూంరెడ్డి ఆసుపత్రికి లక్ష రూపాయలు, గంగా హాస్పిటల్‌కు యాభై వేల రూపాయలు జరిమానాలు విధించారు. బయో మెడికల్ వ్యర్థాలను నిబంధనలకు అనుగుణంగా నిర్వీర్యం చేయాలని, లేకపోతే మెడికల్ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరిమితికి మించి ఇసుక తవ్వకాలతో ఇబ్బందులు

నిలిపివేయాలని గ్రామస్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రేణికుంట గ్రామస్థులు

తిమ్మాపూర్, జూలై 13: ఇసుక రీచ్‌లో పరిమితికి మించి ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని, దీంతో తాములు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్థులు శనివారం మోయతుమ్మెద వాగులో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేణికుంట కొత్తపల్లి గ్రామాల మధ్యగల ఇసుక రీచ్‌లో ఇసుక కాంట్రాక్టర్ పరిమితికి మించి ఇసుక తవ్వుతున్నారన్నారు. దీంతో వాగులో ఉన్న బావులు తేలుతున్నాయని, పైపులైన్లు పగిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోయతుమ్మెద వాగులో పరిమితికి మించి అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారన్నారు. కొత్తపల్లి గ్రామంలో ఇసుక రీచ్‌కు పర్మిషన్ ఉన్నప్పటికి రేణిగుంట శివారుకు వచ్చి ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని విమర్శించారు. వాగుకు ఆనుకుని ఉన్న పొలాల పక్క నుంచి మొరం తవ్వి క్వారీలో రోడ్లకు పోస్తున్నారన్నారు.

వర్షాలు పడితే పొలాలకు గండ్లు పడడంతో నాట్లు వేసిన తర్వాత వరి నారు కొట్టుకు పోతుందన్నారు. వాగులో ఎక్స్‌కవేటర్‌తో ఇసుక తీస్తున్నప్పుడు రైతులు వెళ్లే సరికి డ్రైవర్ అక్కడి నుంచి పరార య్యాడని, అనుమతులుంటే డ్రైవర్ పరార్ కావాల్సిన అవసరం ఏముందని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని రైతులు కోరారు. కార్యక్రమంలో రైతులు రాయమల్లు, వంశీ, శ్రీను, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో మురుగు నీరు

పట్టించుకోని అధికారులు



పాఠశాల ఆవరణలో నిలిచిన మురుగు నీరు

గన్నేరువరం, జూలై 13: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి వచ్చే వృథా నీరు చెట్ల మధ్యన నిలిచి మురుగు నీరుగా మారుతోంది. దీంతో ఈగలు, దోమలు పెరుగుతున్నాయి. దీంతో విద్యార్థులు వ్యాధుల బారిన పడి అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ కోసం వేసిన బోర్ వద్దనే చిన్నపాటి ఇంకుడు గుంతను ఏర్పాటు చేశారు. ఫిల్టర్ చేయగా మిగిలిని వృథా నీటిని ఇంకుడుగుంతలోకి పంపిస్తు న్నారు. ఈ ఇంకుడు గుంత నిండి నీరు బయటకు వెళ్లడంతో ఆ ప్రాంతం మొత్తం నీరు నిలిచి మురుకినీటిగా మారుతోంది. ఇంకుడుగుంత సామర్థ్యాన్ని పెంచితే నీరు బయటకి రాకుండా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మురుగు నీటి సమస్యను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పాఠశాల ఆవరణలో నిండిపోయిన ఇంకుడు గుంత





ఎస్సీ ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

బీర్‌పూర్,జులై 13: బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి గ్రామంలో శనివారం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు విషయంలో విచారణ చేపట్టారు. ఈ నెల 11న తమను కులం పేరుతో దూషించారని కామెర రాజేశ్వర్ అనే వ్యక్తి కొల్వాయి గ్రామానికి చెందిన రామకిష్టు గంగాధర్ కుటుంబ సభ్యులపై ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ కేసు విషయంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామిలు గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వారి వెంట సిబ్బంది ఉన్నారు.

గట్టుదుద్దెనపల్లిలో కాపర్‌వైరు చోరీ

మానకొండూర్, జూలై 13 : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో కాపర్ వైరు చోరీకి గురైంది. గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులకొట్టి సుమారు రూ. 30వేల విలువ గల కాపర్ వైర్‌ను దొంగిలించారు. చంజర్ల ఏఈ రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డమ్మీ తుపాకీతో కనిపించిన యువకుడు

● అదుపులోని తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించిన పోలీసులు

బీర్‌పూర్, జూలై 13: పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో డమ్మీ తుపాకీతో మండలానికి చెందిన ఓ యువకుడు బీర్‌పూర్ జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో కనిపించగా అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి వివరాలు తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా బొమ్మ తుపాకీ కలిగి ఉన్న యువకుడు పాఠశాల సమీపంలో కన్పించడంతో అదుపులోనికి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. ఆ బొమ్మ తుపాకీని ఫొటోషూట్ కోసం అమెజాన్‌లో కొనుగోలు చేశానని తెలుపగా, యువకుడికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించామన్నారు.


ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

సుభాష్‌నగర్, జూలై 13: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతంను ఎంఆర్‌పీఎస్, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ గోష్కి శంకర్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గాలిపెల్లి శ్రీనివాస్ కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీల అభివృద్ధికి తోడ్పడాలని ఆయనను కోరారు.











కృష్ణ యతీంద్ర రామానుజ జీయర్ స్వామి మృతి


కృష్ణ యతీంద్ర రామానుజ జీయర్ స్వామి (ఫైల్)

కరీంనగర్ కల్చరల్, జూలై 13: కరీంనగర్‌కు చెందిన పరమహంస పరివ్రాజకాచార్యులు త్రిదండి శ్రీకృష్ణ యతీంద్ర రామానుజ జీయర్ స్వామి (89) అనారోగ్యంతో కరీంనగర్‌లో శుక్రవారం రాత్రి మృతి చెందారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో ఉన్న స్వామి హైదరాబాద్‌లో చికిత్స తీసుకున్నారు. దేశ వ్యాప్త విశిష్టాద్వైత జీయర్ స్వాముల్లో ఆయన ఒకరు. ఆయన మెట్‌పల్లి ఖాదీ విలేజ్ కమిషన్ బోర్డులో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. అనంతరం సన్యాసం స్వీకరించారు. ఆయన తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సంస్కృత భాషలతో పాటు జ్యోతిషంలో పలు గ్రంథాలు రచించారు. జూలై 2004లో ఆయన సన్యాసాశ్రమం స్వీకరించారు. స్వామి మృతిపై పలువురు సంతాపం తెలిపారు. స్వామీజీ పార్థివ దేహాన్ని ఆయన కోరిక మేరకు పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం, నీరుకుళ్ల రంగనాయకస్వామి వెలసిన మానేరు నది ఒడ్డున యతీశ్వర సాంప్రదాయం ప్రకారం బృందావనంలో ఖననం చేశారు.

శంషాబాద్‌కు రాజధాని బస్సులు

భగత్‌నగర్, జూలై 13: జగిత్యాల డిపో నుంచి శంషాబాద్‌కు రాజధాని బస్సులు నడిపించనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ సోమవారం నుంచి జగిత్యాల డిపో నుంచి బయలుదేరే రాజధాని బస్సులు ఉప్పల్ క్రాస్‌రోడ్, ఎల్బీనగర్, మీదుగా శంషాబాద్ చేరుకుంటాయన్నారు. జగిత్యాల నుంచి శంషాబాద్‌కు సాయంత్రం 4.30, 8.00 గంటలకు, కరీంనగర్ నుంచి శంషాబాద్‌కు సాయంత్రం 5.45, 9.30 గంటలకు, శంషాబాద్ నుంచి కరీంనగర్/జగిత్యాలకు ఉదయం 7.15, 8.00 గంటలకు బస్సులు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

ఓదెలలో సుబేదర్ గంజ్ ఎక్స్‌ప్రెస్ రైలు నిలిపివేత

ఓదెల, జూలై 13: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో సికింద్రాబాద్ నుంచి సుబేదర్ గంజ్ వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలును అధికా రులు శనివారం రెండు గంటల పాటు నిలిపివేశారు. అప్‌లైన్లో వ స్తున్న ఎక్స్‌ప్రెస్ రైలుకు ముందు న్న కొలనూర్ రైల్వేస్టేషన్‌లో లైన్ క్లియర్ లేకపోవడంతో, ఉదయం 10 గంటలకు వచ్చిన ఎక్స్ ప్రెస్ రైలు ఓదెలలో నిలిపి వేశారు. 12 గంటల తర్వాత అధికారులు కిలో మీటర్ వెనుకకు పంపించి మరో లైన్ ద్వారా సుబేదార్ గంజ్ వైపు పంపించారు. దీంతో పొత్కపల్లి, కొలనూర్, ఓదెల స్టేషన్లలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంత రాయం ఏర్పడింది. వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిపోయే ప్రజలు ఓదెల గేటు వద్దనే ఆగిపోయారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎస్సారెస్పీలోకి శనివారం 1,852 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్టు సామర్థ్యం 90.323 టీఎంసీలకు ప్రస్తుతం 12.556 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 17.802 టీఎంసీల నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 494 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జూన్ 1 నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 6.775 టీఎంసీల నీరు వచ్చి చేరింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముస్తాబాద్, జూలై 13: మండలంలోని బందనకల్ శివారులో మూడు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేసిన సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు శనివారం మృతి చెందాడు. ముస్తాబాద్ ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన తుడుము శ్రీనాథ్ (24) 10వ తేదీన బందనకల్ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. శ్రీనాథ్ ప్రేమ విషయంలో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి చనిపోయడాని ఆయన చెప్పారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య


గుగులోతు సరోజ (ఫైల్)

వీర్నపల్లి, జూలై 13: మండల కేంద్రానికి చెందిన గుగులోతు సరోజ (55) అనే మహిళ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. సరోజ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె భర్త పీర్యా గతంలో అనారోగ్యంతో మృతి చెందాడు. ముగ్గురు కూతుళ్లకు పెళ్లిళ్ల చేయడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీనికి తోడు అనారోగ్య సమస్యలు రావడంతో ఆవేదనకు గురై శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎలుకల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ఆసుపత్రికి తరలించగా శనివారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిలే నిరాహారదీక్షకు అనుమతి ఇవ్వండి


తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన నేరెళ్ల బాధితుడు హరీష్

తంగళ్లపల్లి, జూలై 13: న్యాయం కోసం రిలే నిరాహార దీక్ష చేపడుతున్నాని, దానికి అనుమతి కావాలని నేరెళ్ల బాధితుడు కోల హరీష్ తంగళ్లపల్లి పోలీసులకు శనివారం వినతి పత్రం అందజేశాడు. 2017 సంవత్సరంలో కొతమంది పోలీస్ అధికారులు తమపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, చిత్ర హింసలకు గురిచేశారని ఆరోపించారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని విన్నవించినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 17వ తేదీన నేరెళ్ల గ్రామ పంచాయతీ ఎదుట రిలే నిరాహారదీక్ష చేపడుతున్నట్లు తెలిపాడు. దీనికి పోలీసులు అనుమతులు ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు.

రైలు కిందపడి వృద్ధురాలి మృతి

జమ్మికుంట, జూలై 13: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన ఆకుల లక్ష్మి (60) ఖాళీ వాటర్ బాటిళ్ళు ఏరుకుంటూ జీవనం సాగిస్తుంది. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

15 మంది మందుబాబుల అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జూలై 13: సిరిసల్ల పట్టణం శాంతినగర్ ప్రాంతంలో శనివారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన మందుబాబులను పోలీసులు అరెస్ట్ చేశారు. మద్యంబాటి ళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు 15 మందిపై కేసు నమోదు చేసి 5 ఆటోలు సీజ్ చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

అనారోగ్యంతో పోలీస్ జాగిలం మృతి


నివాళులర్పిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తంగళ్లపల్లి, జూలై 13: పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎనిమిదేళ్లగా విధులు నిర్వహిస్తున్న జర్మన్ షెపర్డ్ సంతతికి చెందిన పోలీస్ జాగిలం ట్యాంగో అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. తంగళ్లపల్లి మండలం తాడూర్ గ్రామంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ అఖిల్‌మహాజన్, పోలీస్ అధికారులు, పోలీస్ డాగ్ హ్యాండ్లర్ లక్ష్మణ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ట్యాంగో ఎనిమిదేళ్లలో జిల్లాలో 15 హత్య కేసులు, 84 దొంగతనాలు, మొత్తం 99 కేసుల్లో విధులు నిర్వహించినట్లు చెప్పారు. 2017లో ట్యాంగో తన హ్యాండ్లర్ లక్ష్మణ్‌తో కలిసి ఐబీటీసీ మొయినాబాద్‌లో ఎనిమిది నెలల బేసిక్ ట్రెయినింగ్ పూర్తి చేసుకుని జిల్లాకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ చంద్రయ్య, ఆర్ఐలు యాదగిరి, మధుకర్, రమేష్, రాజు పాల్గొన్నారు.

అర్బన్‌బ్యాంక్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ


అర్బన్ బ్యాంక్ పాలకవర్గ సభ్యులు

కరీంనగర్ అర్బన్, జూలై 13: కరీంనగర్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులు శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. సీఈవో ఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. అర్బన్ బ్యాంక్ పాలకవర్గం పదవీ కాలం రెండు నెలల క్రితం ముగిసింది. కొత్త పర్సన్ ఇన్‌చార్జి కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 8న జీవో విడుదల చేసింది. అర్బన్ బ్యాంక్ చైర్మన్‌గా కరీంనగర్ అదనపు కలెక్టర్ వ్యవహరించనుండగా, పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులుగా డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ ఆఫీసర్‌తో పాటు గడ్డం విలాస్ రెడ్డి, మడుపు మోహన్, ముక్క భాస్కర్, బీరం ఆంజనేయులు, మహ్మద్ కలీంఖాన్, రేగొండ సందీప్, మూల లక్ష్మీరవీందర్‌రెడ్డి, ఎ విద్యాసాగర్, ఇ లక్ష్మణ్‌రాజు, ఎండీ సమియొద్దీన్, మంగి రవీందర్‌ను నియమించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యుడు గడ్డం విలాస్‌రెడ్డి మాట్లాడుతూ పాలకవర్గ నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. అర్బన్ బ్యాంక్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఖాతాదారులు, బ్యాంక్ సిబ్బంది సహకారంతో కలిసి అభివృద్ధి చేస్తామన్నారు. కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డివిడెండ్ ఫండ్‌ను మూడు నెలల్లో విడుదల చేసేందుకు కృషి చేస్తామన్నారు. త్వరలోనే గంగాధర నూతన బ్రాంచి ప్రారంభోత్సవంతోపాటు కరీంనగర్ మెయిన్ బ్రాంచి పరిధిలో ఏటీఎం సెంటర్‌ను ప్రారంభిస్తామన్నారు. నూతన పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులను బ్యాంక్ సిబ్బంది ఈ సందర్భంగా సన్మానించింది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రహమాన్, కాంరెడ్డి రాంరెడ్డి, మూల రవీందర్‌రెడ్డి, సర్దార్ దన్నాసింగ్, పోరండ్ల రమేష్, ఎండీ అమీర్, మూల జైపాల్, గంగుల దిలీప్, అనరాసు కుమార్, కుర్ర పోశయ్య, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ షబానా, లింగమూర్తి, రాజ్‌కుమార్, జ్యోతి, ఇమ్రాన్, షాన్‌వాజ్, అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, జూలై 3: అప్పుల బాధ భరించలేక మండలంలోని మోతె చెరువులో దూకి జగిత్యాల పట్టణానికి చెందిన ఏదుల కిషోర్ (46) ఆత్మహత్యకు చేసుకున్నాడని జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కిషోర్ పట్టణంలోని జంబిగద్దె ప్రాంతంలో కిరాణం నడుపుతూ జీవిస్తున్నాడు. షాపు నిర్వహణకు ఐదు లక్షల రూపాయలు అప్పు చేశాడు. కొన్ని రోజుల నుంచి దుకాణం నడవడం లేదు. దీంతో చేసిన అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపం చెంది చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై తెలిపారు.

● **నమిలకొండలో..**

కొడిమ్యాల: మండలంలోని నమిలకొండ గ్రామానికి చెందిన శతరాసి సురేష్ (39) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు పోలీసులు శనివారం తెలిపారు. సురేష్ కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రులో చూపించుకున్నా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని అత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర


రథానికి నమస్కరిస్తున్న భక్తులు

రాయికల్, జూలై 13: రాయికల్ పట్టణంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ మోర హన్మాండ్లు రథయాత్రను ప్రారంభించారు. రథం ముందు రోడ్డును ఊడ్చి మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. స్థానిక అంగడి బజార్‌లో ప్రారంభమైన యాత్ర గాంధీ విగ్రహం నుంచి పటేల్ బొమ్మ మీదుగా శివాజీ చౌక్ నుంచి తిరిగి పాత బస్టాండ్ వరకు చేరుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, రథయాత్ర కమిటీ సభ్యులు, యువకులు, శ్రీకృష్ణ భక్తులు పాల్గొన్నారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ


ధర్మపురి ఆలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, జూలై 13: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామిని శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. భారీగా తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు. ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదానం కోసం నిజామాబాద్ జిల్లాకు చెందిన శ్రీ సరిపల్లి ధర్మవాసవి దంపతులు 1,00,116 రూపాయల శనివారం అలయ ఈవో సంకటాల శ్రీనివాస్‌కు అందించారు.

'చెక్‌డ్యాంకు మరమ్మతులు చేయాలి'

తంగళ్లపల్లి జూలై 13: తంగళ్లపల్లి శివారులోని మానేరు నదిలో నిర్మించిన చెక్‌డ్యాం వరదలకు కొట్టుకు పోయిందని, ఆ చెక్‌డ్యాంకు మరమ్మతులు చేయాలని స్థానిక రైతులు, గీత కార్మికులు కోరారు. శనివారం తంగళ్లపల్లి మండలంలో పర్యటించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను రైతులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్ నాసిరకం పనులతో వరదకు చెక్ డ్యాం కొట్టుకుపోయిందన్నారు. వ్యవసాయ భూమితోపాటు గీతకార్మికుల తాటి చెట్లు పెంచుతున్న భూమి కోతకు గురై తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. చెక్‌డ్యాం తెగిపోవడంతో ఏర్పడ్డ నీటి గుంతలో పడి చిన్నారులు మృతి చెందారన్నారు. జరిగిన నష్టానికి పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవడంతోపాటు త్వరగా మరమ్మతులు చేపట్టి చెక్‌డ్యాంను వినియోగంలోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. వర్షాలు పడితే తెగిన చెక్‌డ్యాంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, ఆలోపే పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, గీత కార్మికులు ఎడ్మాల తిరుమలరెడ్డి, ఎడ్మాల బాల్‌రెడ్డి, బండి సత్తయ్య కొండయ్య గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా త్రిశక్తి ఆలయ వార్షికోత్సవం


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

మెట్‌పల్లి, జూలై 13: పట్టణంలోని త్రిశక్తి ఆలయం వార్షికోత్సవాన్ని నిర్వాహకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మహిళలతో కుంకుమ పూజ జరిపించారు. ఈ సంద ర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత-సత్య నారాయణ దంపతులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు వారిని శాలువతో సన్మానించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో జెట్టి లింగం తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల భూములకు పరిహారం ఇప్పించండి


ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న భూ నిర్వాసితులు

సిరిసిల్ల రూరల్, జూలై 13: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి తీసుకున్న భూములకు నష్టపరిహారం ఇప్పించి తమను ఆదుకోవాలని నిర్వాసితులు కోరారు. సిరిసిల్లలో శనివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి వినతి పత్రాలను అందజేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని సర్వేనంబరు 408లో ఉన్న 36 ఎకరాల భూముని మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాల కోసం గత ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. భూములను కోల్పోయిన తమకు మరోచోట భూములను అందిస్తామని మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ హామీ ఇచ్చారని చెప్పారు. ఆ భూముల్లో భవనాలను నిర్మించారని, నష్టపరిహారం మాత్రం ఇవ్వడం లేదని అన్నారు. కలెక్టర్‌తోపాటు ఆర్డీవోను అడిగితే తమపైనే అక్రమ కేసులను పెట్టించారని, ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. తమ భూములకు నష్టపరిహారంతోపాటు మరోచోట భూములను అందించాలని కోరారు. పట్టణ పరిధిలోని విలీన గ్రామాలైన సర్దాపూర్, పెద్దూర్ గ్రామాలు ప్రభుత్వ భూముల్లోనే ఉన్నాయని, ఆ గ్రామాల్లో ఎలాంటి నిర్మాణాలను చేపట్టాలన్నా మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూముల్లో నిర్మాణాలను చేపట్టేందుకు పట్టాలను అందించి అనుమతులను ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, గడ్డం నర్సయ్య, తొమ్మిదో వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్, సలేంద్రి బాలరాజుయాదవ్, మెడుదుల దేవయ్యయాదవ్, గొడుగు మల్లేశం, గొడుగు పర్శరాములు, గొడుగు చిన్నఎల్లయ్య, నాగుల లక్ష్మీ, సలేంద్రి రాజ్యలక్ష్మి, లింగంపల్లి అశోక్, లింగంపల్లి భూలక్ష్మీ, ఎనగందుల ప్రేమల, ఉలిసే తిరుపతి, బడుగు భూమయ్య పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత

ధర్మపురి, జూలై 13: ధర్మపురి పట్టణానికి చెందిన మెరుగు శ్రీనివాస్, గొల్లపల్లి మండలంలోని బొంకూర్ గ్రామానికి చెందిన ఐతం వెంకటేష్ గత నెలలో సెల్ ఫోన్లు పోగొట్టుకున్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను గుర్తించిన ఎస్ఐ ఉదయ్‌కుమార్ వాటిని స్వాధీనం చేసుకుని శ్రీనివాస్, వెంకటేష్‌కు శనివారం అప్పగించారు.

వృద్ధుడి మృతదేహం గుర్తింపు


నారాయణస్వామి మృతదేహం

కరీంనగర్ క్రైం, జూలై 13: కరీంనగర్ సప్తగిరి కాలనీ మాచర్ల గార్డెన్ వెనుక వైపున ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైందని కరీంనగర్ టూ టౌన్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డులో పెద్దపల్లి నారాయణస్వామి (70), మార్కండేయనగర్ అని చిరునామా ఉందన్నారు. ఆ చిరునామా ప్రకారం ఇంటి నంబర్‌ను తనిఖీ చేయగా ప్రభుత్వ పాఠశాలదిగా వెల్లడైందని తెలిపారు. మృతుడు నారాయణకు సంబంధించిన వారు కరీంనగర్ రెండో టౌన్ సీఐ (8712670762) లేదా ప్రభుత్వ ఆసుపత్రి అవుట్ పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ కె రవీందర్ (9491481433)క సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచామని తెలిపారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక, జూలై 13: మండలంలోని మామిడాలపల్లిలో ఆటో ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం మార్కండేయ కాలనీకి చెందిన చింతల కిరణ్ అనే వ్యక్తి ఆటో ట్రాలీలో రేషన్ దుకాణాల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని ఎక్కువ ధరకు ఇతరులకు విక్రయిస్తున్నారని గుర్తించిన పోలీసులు బియ్యం స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కిరణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి తిరుపతి తెలిపారు.

● శంకరపట్నం: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని శనివారం ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి పట్టుకున్నారు. దిరావత్ పాండు, దిరావత్ చందా, దిరావత్ శ్రీను మూడు ఆటోల్లో 18 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

రాయికల్, జూలై 13: మండలంలోని రాజ్‌నగర్ తండా, ధర్మాజీపేట గాంధీ తండాలలోని నాటుసారా స్థావరాలపై శనివారం జిల్లా ఎక్సైజ్ అధికారి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 250 లీటర్ల బెల్లం పానకం, నాటుసారా తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు. ప్రభుత్వం నిషేధించిన గుడుంబా తయారు చేసినా, అమ్మినా, కలిగి వున్నా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో జగిత్యాల ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ రాజమౌళి, ఎస్సై స్వప్న పాల్గొన్నారు.

గల్ఫ్ నుంచి స్వగ్రామం చేరిన మృతదేహం


తునికి శేఖర్ (ఫైల్)

రాయికల్, జూలై 13: మండలంలోని కొత్తపేటకు చెందిన తునికి శేఖర్ (27) అనే యువకుడు దుబాయ్‌లోని షార్జాలో 20 రోజుల క్రితం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఈ విషయాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన దుబాయ్‌లోని ఇండియన్ కాన్సులేట్, విదేశాంగ మంత్రి జై శంకర్‌తో మాట్లాడారు. జీడబ్ల్యూపీసీ సమక్షంలో అధ్యక్షుడు గుండెల్లి నరసింహ, బొడ్డుపల్లి రాములు ఆధ్వర్యంలో యువకుడు పని చేస్తున్న బియ కంపెనీతో మాట్లాడారు. వారి ప్రయత్నంతో శేఖర్ మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరుకుంది.

● జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన వంగ సురేష్ (38) ఇరాక్ లో ఇటీవల మృతి చెందాడు. శనివారం ఆయన మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. గత నెల 23న సురేష్‌కు పక్షవాతం రావడంతో ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతున్న సమయంలో గుండెపోటుకు గురై చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య వసంత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అప్పు చెల్లించమన్నాడని హత్యాయత్నం

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 13: తీసుకున్న అప్పు చెల్లించమన్నందుకు గొడవ తలెత్తింది. ఆ గొడవ కత్తి పోట్లకు దారితీసింది. గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుందిల్లకు చెందిన చొప్పరి లక్ష్మణ్ అదే గ్రామానికి చెందిన దండె రాహుల్‌రాజ్‌పై శనివారం కత్తితో దాడి చేశాడు. సుందిల్ల గ్రామానికి చెందిన చొప్పరి లక్ష్మణ్ ఇంటికి సమీపంలో ఉండే రాహుల్ రాజ్‌ను అవసరాల నిమిత్తం లక్ష రూపాయలు అప్పుగా అడగగా, అతను ఓ వ్యక్తి వద్ద ఇప్పించాడు.

ఆరు నెలల్లో తిరిగి ఇస్తానని చెప్పాడు. గడువు ముగియడంతో తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని రాహుల్ పలుమార్లు లక్ష్మణ్‌ను అడిగాడు. శుక్రవారం లక్ష్మణ్ ఇంటికి వెళ్లి డబ్బులు అడగగా ఇవ్వనని తిట్టాడు. రాత్రి రాహుల్ ఇంటికి వెళ్లిన లక్ష్మణ్ అతడిపై గొడ్డలితో దాడికి ప్రయత్నించగా స్వల్ప గాయాలయ్యాయి. దాడి తర్వాత లక్ష్మణ్ పారిపోయాడు. శనివారం ఉదయం మరోసారి రాహుల్‌రాజ్ ఇంటికి వెళ్లిన లక్ష్మణ్ కత్తితో దాడి చేశాడు. దీంతో రాహుల్‌కు కాలిపై, మొహంపై గాయాలయ్యాయి. రాహుల్ కుటుంబసభ్యులు లక్ష్మణ్‌పై కారంపొడి చల్లడంతో అక్కడ నుంచి పారిపోయాడు. రాహుల్‌రాజ్ భార్య ప్రేమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మణ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

చెరువు కట్ట, రహదారి కబ్జా చేశారని రైతుల ఆందోళన


మంథనిలో ధర్నా చేస్తున్న రైతులు

మంథని, జూలై 13: రైతులు తమ వ్యవసాయ పనుల కోసం పొలాల వద్దకు వెళ్లేందుకు వినియోగిస్తున్న చెరువుకట్ట, రహదారిని కొంత మంది కబ్జా చేశారని రైతులు మంథనిలోని అబేద్కర్‌చౌక్‌లో శనివారం ఆందోళనకు దిగారు. రైతుల కథనం ప్రకారం.. బిట్టుపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 116లోని 217 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. చెరువులోని నీటి ద్వారా మండలంలోని కాకర్లపల్లి, సూరయ్యపల్లి, ధర్మారం, సీతంపల్లి, బిట్టుపల్లి, ఎక్లాసూపూర్, నెల్లిపల్లి గ్రామాల్లోని వేలాది ఎకరాలు సాగవుతున్నాయి. చెరువు మీద నుంచి పొలాల వద్ద వెళ్లేందుకు కొన్నేళ్లుగా రైతులు చెరువు కట్టను అనుకొని ఉన్న రహదారిని వినియోగిస్తున్నారు. చెరువు కట్టను అనుకొని ఉన్న రహదారిని ముత్తినేని స్వామి, మాధవరావు కిష్టయ్య, పోగుల శంకరయ్య, ఆకుతోట రాజయ్య అనే రైతులు తమ వ్యవసాయ భూమిలో కలుపుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బిట్టుపల్లి గ్రామ రైతులు భూమి కబ్జాను అడ్డుకునే ప్రయత్నాలు మొదులు పెట్టారు. ఇందులో భాగంగా గత సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి కబ్జా విషయాన్ని వివరించి అడ్డుకోవాలని దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు కబ్జా స్థలం వద్దకు వెళ్లి పంచనామా నిర్వహించి పనులు నిలిపివేయాలని ఆదేశించారు. కబ్జాదారులు దీన్ని పట్టించుకోకుండా చెరువుకట్ట, రహదారి భూమిని తమ వ్యవసాయ భూమిలో కలుపుకున్నారు. దీంతో గ్రామానికి చెందిన రైతులంతా ఏకమై శనివారం ఎక్స్‌కవేటర్ సాయంతో చెరువుకట్ట రహదారి పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న కబ్జాదారులు పనులను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. విషయాన్ని తెలుసుకున్న మంథని పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేసి అక్కడి నుంచి పంపించారు. దీంతో రైతులంతా మంథనికి చేరుకొని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. తమ చెరువు కట్ట, రహదారిని కబ్జా చేసిన వారిని వెంటనే శిక్షించాలని.. తమ రహదారిని పునరుద్ధరించాలని.. వెంటనే తమకు న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రైతులు ధర్నా చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విరమింపే ప్రయత్నం చేసినప్పటికీ వారు వినలేదు. ధర్నా చేసే రైతులతో మంథని తహసీల్దార్ రాజయ్య ఫోన్లో మాట్లాడి సోమవారం వరకు రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో రైతులు తమ ధర్నాను విరమించారు.

నేడు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, జూలై 13: సబ్‌స్టేషన్‌ల నెలవారీ నిర్వహణలో భాగంగా ఆదివారం ఉదయం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నగరంలో వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్, వన్, టూ, ఏడిఈలు, సాయినేని నరేందర్, సుధీర్ కుమార్ తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు తెలంగాణ చౌక్ ,బస్టాండ్ ఏరియా, పోలీస్ హెడ్‌క్వాటర్ ప్రాంతం, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ప్రాంతం, మార్వాడి ఆలయం, ధోబీ వాడా, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, టవర్ సర్కిల్, గంజ్, డీఎఫ్‌ఓ, డాక్టర్ స్ట్రీట్ ఏరియాలో సివిల్ హాస్పిటల్ వెనుక వైపు, డాక్టర్ శ్రీదేవి హాస్పిటల్ ఏరియా, డాక్టర్ భూమ్‌రెడ్డి హాస్పిటల్ రోడ్, సాయినగర్, వీక్లీ మార్కెట్ ఏరియా, గర్ల్స్ జూనియర్ కాలేజ్ రోడ్, సీపీ ఆఫీస్ రోడ్, టవర్ సర్కిల్, అహ్మద్‌పురా, రూరల్ పోలీస్ స్టేషన్ ఏరియా,మార్కెట్ ఏరియా, గంజ్, సిఖ్‌వాడి, బోయవాడ, భరత్ టాకీస్ ఏరియా, కమాన్ ఏరియా, రాఘవేంద్ర నగర్, లక్ష్మీనగర్, వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అపూర్వ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కరీంనగర్ రూరల్, జూలై13: మండలంలోని చామనపల్లి గ్రామంలో వాణినికేత్ బాల విహార్ స్కూల్ 2013-14సంవత్సర విద్యార్థులు శనివారం నగరంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాడు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.నారాయణరెడ్డి, కమలాకర్‌రెడ్డి, రామకృష్ణ, రాజేందర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హరితహారం



మొక్కలు నాటుతున్న వివేకానంద కళాశాల యాజమాన్యం

గణేశ్‌నగర్,జూలై 13: వివేకానంద డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటినట్లు కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ధనపురి సాగర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ డాక్టర్ సిఎచ్. శ్రీనివాస్, శ్రావణ్ కుమార్ మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వివిధ ప్రదేశాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సాగర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యతను కూడా స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ ఏవోబి శ్రవణ్ కుమార్, ఏసీఓ ఆ. సంపత్ కుమార్, రామేశ్వర్ రావు,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డి.సాగర్, బైరం మహేష్, కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో గోరింటాకు ఉత్సవం



చొప్పదండిలో గోరింటాకు ఉత్సవంలో పాల్గొన్న మహిళలు

చొప్పదండి,జూలై10: చొప్పదండిలోని అయ్యప్ప ఆలయంలో ఆషాడమాసాన్ని పురస్కరించుకొని గోరింటాకు ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు గోరింటాకు పెట్టుకొని గౌరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో అలయ కమిటీ చైర్మెన్ బొడిగె వెంకటేశ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ గౌడ్,నాయకులు మహిళలు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, జూలై 13: నగరంలోని ముఖరంపుర వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో శనివారం భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో రచయిత, విశ్రాంత ఉపాధ్యాయుడు వైరాగ్యం ప్రభాకర్ రచించిన రామాయణము ధర్మవచనములు-సూక్తులు పుస్తకావిష్కరణ జరిగింది. తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కార విజేత పెండ్యాల కిషన్‌శర్మ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వశ్రేయమైనది సాహిత్యమని అన్నారు. మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల విద్యాలయం వేలపాలెం ప్రిన్సిపల్ డాక్టర్ సి నారాయణస్వామి మాట్లాడుతూ మహామహులు జన్మించిన గడ్డ కరీంనగర్ అని అన్నారు. రచయిత, కాలమిస్ట్, పద్యకవి పాణ్యం దత్త శర్మ పుస్తక పరిచయ చేశారు. మాడిశెట్టి గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్టూనిస్ట్, ఆనిమేషన్ డైరెక్టర్ కల్యాణం శ్రీనివాస్, కాసు మహేందర్ రాజు, దాస్యం సేనాధిపతి, బొమ్మకంటి కిషన్, గంప ఉమాపతి, డాక్టర్ ముదుగంటి సుధాకరరెడ్డి, సందినేని నరేంద్ర, వెల్ముల జయపాల్‌రెడ్డి తదితరులున్నారు.

ఆటో యూనియన్ కమిటీ ఏర్పాటు



ఆటో యూనియన్ కార్యవర్గ సభ్యులు

హుజూరాబాద్, జూలై 13: హుజూరాబాద్ నుంచి పోతిరెడ్డిపేట రూట్‌కు వెళ్లే ఉమేష్ చంద్ర ఆటో యూనియన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎడ్ల భిక్షపతి, ఉపాధ్యక్షులుగా రాగం శ్యామ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా ఎర్ర కుమార్, గౌరవ సలహాదారుడిగా సతీష్, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి, కోశాధికారిగా ఎండీ అమ్జాద్, కార్యవర్గ సభ్యులుగా ప్రశాంత్, రాకేష్, అర్జున్, శ్రీకాంత్, రాజయ్య, రమేష్, రాజేందర్, మధు, కొంరయ్య, వెంకటేష్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజు, రాజకుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు..!

● ప్రారంభానికి నోచుకోని పల్లెదవాఖానా

భగత్‌నగర్, జూలై 13: కొత్తపల్లి ఏఎన్ఎం-1 సబ్ సెంటర్ పల్లె దవాఖానా ప్రారంభానికి నోచుకోవడం లేదు. కొత్తపల్లి పట్టణానికి సమీపంలో నూతనంగా లక్షలు వెచ్చించి నిర్మించిన పల్లె దవాఖానా ఏఎన్ఎం-1 సబ్‌సెంటర్ భవనం ప్రారంభం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తపల్లి పట్టణంలో రెండు ఏఎన్ఎం సబ్ సెంటర్‌లకు గాను ఏఎన్ఎం-1 కోసంపల్లె దవాఖానాపేరుతో కొత్తపల్లి పట్టణానికి సమీపంలో నిర్మించారు. కాలం గడుస్తున్నా ఎఎన్ఎం-1 సబ్‌సెంటర్‌ను ప్రారంభించడం లేదు. ఏఎన్ఎం-2 సబ్‌సెంటర్ కోసం కొత్తపల్లి మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో ఉన్న పాత ఆరోగ్య కేంద్రాన్ని అందించారు. ఏఎన్ఎం-1 కోసం నూతనంగా నిధులు వెచ్చించి భవనాన్ని అన్ని హంగులతో నిర్మించినా ప్రారంభానికి నోచుకోక పోవడంతో అలంకార ప్రాయంగా మిగిలి పోయింది. నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానాలో పిచ్చి మొక్కలు పెరిగిపోయి శిథిలావస్థకు చేరుకుంటున్నది.



ప్రారంభానికి నోచుకోని కొత్తపల్లి ఏఎన్ఎం-1 సబ్‌సెంటర్

● అద్దెకు నిధులు లేక ఖాళీ

గత కొంతకాలంగా ఏఎన్ఎం-1 సబ్‌సెంటర్ అద్దె భవనంలో కొనసాగింది. గతంలో పూర్తి స్థాయిలో ఏఎన్ఎం ఉండడంతో అద్దె చెల్లించి ఏఎన్ఎం-1 సబ్‌సెంటర్‌ను నిర్వహించారు. ప్రస్తుతం ఏఎన్ఎం-1 పోస్టులో కాంట్రాక్ట్ ఉద్యోగి ఉండడంతో అద్దె చెల్లించే స్థితిలో లేక పోవడం, ప్రభుత్వం నుంచి అద్దెకోసం నిధులు రాక పోవడంతో సబ్‌సెంటర్‌ను ఖాళీచేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమయింది. దీంతో పాత అద్దెభవనం ఖాళీచేయడం, నూతనంగా నిర్మించిన ఏఎన్ఎం సబ్‌సెంటర్ ప్రారంభానికి నోచుకోక పోవడంతో ఆరోగ్య సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● ఆరోగ్య సిబ్బందికి తప్పని తిప్పలు

కొత్తపల్లి ఏఎన్ఎం-1 పరిధిలోని ఆరోగ్య సిబ్బందికి నూతన భవనం ప్రారంభానికి నోచుకోక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సబ్‌సెంటర్ పరిధిలోని కుటుంబాల్లో సర్వేలు నిర్వహించి గర్భిణి స్త్రీల నమోదు, వారికి పరీక్షలు, అవసరమైన వారిని ఆసుపత్రుల్లో చేర్పించేందుకు సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు పేద ప్రజలకు అందుబాటులో ఉండేందుకు గాను రోజు వారీ వాక్సిన్‌లు, చిన్నచిన్న ఇబ్బందులతో ఆసుపత్రులకు వచ్చేవారికి చికిత్సలు అందించే వీలు లేకుండా పోయింది. కొత్తపల్లి ఏఎన్ఎం-1 సబ్‌సెంటర్ కోసం నిర్మించిన భవనాన్ని ప్రారంభించడానికి ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవాల్సిన అవసరం ఉంది.

పేకాట శిబిరంపై దాడి

జమ్మికుంట రూరల్, జూలై 13: మండలంలోని శంభునపల్లిలో వెంకట్‌రెడ్డి ఇంటి సమీపంలో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతుండగా శనివారం పోలీస్‌లు దాడులు నిర్వహించారు. వారి వద్ద ఉన్న 16వేల 510నగదును స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ఆగ్రోస్ చైర్మన్‌కు సన్మానం

జమ్మికుంట రూరల్, జూలై 13: తెలంగాణ ఆగ్రోస్ చైర్మన్‌గా నూతనంగా నియామకం అయిన బాలరాజును హైదరాబాద్‌లో కరీంనగర్ జిల్లా ఆగ్రోస్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బుర్ర మల్లికార్జున్ కలిసి శాల్వాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఆయన వెంట రాష్ట్ర ఉపాధ్యక్షులు జోడు ప్రణయ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ కొంరయ్య, ఈసి మెంబర్ ఆకునూరి సిద్ధు తదితరులు ఉన్నారు.

రాంపూర్ వాసికి డాక్టరేట్



డాక్టరేట్‌ను చూపుతున్న కుడికల్ భాస్కర్

హుజూరాబాద్‌రూరల్, జూలై 13: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కుడికల్ భాస్కర్ డాక్టరేట్ అందుకున్నారు. ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ద్వారా సామాజిక సేవ విభాగంలో డాక్టరేట్‌ను అందుకున్నారు. కరోనా సమయంలో అన్నదానం, ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, పేద విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ తదితర కార్యక్రమాలు చేసినందుకు ఈ డాక్టరేట్‌ను అందుకున్నారు.

లయన్స్ క్లబ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్సలు



పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కరీంనగర్ రూరల్, జూలై13: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ బొమ్మకల్ లయన్ చింతల కిషన్ పటేల్ జిల్లా చైర్ పర్సన్ హంగర్ రిలీఫ్ లయన్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 320 జి ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రిలో పలువురికి ఉచిత శస్త్ర చికిత్స నిర్వహించారు. బొమ్మకల్ గ్రామానికి చెందిన మిడిదొడ్డి లచ్చవ్వ, నగరానికి చెందిన గుండా అనసూయ, రాఘవ, బల్సాని ఈశ్వరమ్మలకు ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదురు సురేష్, ట్రస్ట్ సభ్యులు కొల అన్నారెడ్డి సహకారంతో ఉచితంగా శాస్త్ర చికిత్సలు నిర్వహించారు. వీరికి పండ్లు బ్రెడ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టెక్నీషియన్ బట్టు రాజేందర్, చింతల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు..

అన్నారం వారసంతకు మోక్షమెప్పుడో?

మానకొండూర్, జూలై 13 : మండలంలోని అన్నారం గ్రామంలో రెండేళ్ల క్రితం ఉపాధిహామీ పథకం కింద రూ.9లక్షలు గ్రామపంచాయతీ నిధులు రూ. 3లక్షలు మొత్తం రూ. 12లక్షలు వెచ్చించి నిర్మించిన వారసంత ఉపయోగంలోకి రాకుండా అలంకార ప్రాయంగా దర్శనమిస్తోంది. గ్రామస్థులకు తాజా కూరగాయలు సరసమైన ధరలకు ఒకే ప్రదేశంలో లభించాలనే ఉద్దేశ్యంతో నిర్మించిన వారసంత అందుబాటులోకి రాకుండా నిరుపయోగంగా మారింది. కాగా అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరు నెలల నెలల క్రితం వారసంతను ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వారసంతలో కూరగాయల కొనుగోళ్లు, అమ్మకాలు జరుగలేదు. దీంతో గ్రామస్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. లక్షలు వెచ్చించి నిర్మించారు.. లక్షణంగా వదిలేశారు.. అన్న చందంగా వారసంత మారిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వాడవాడలా తిరుగుతూ కూరగాయలు విక్రయించే వారిని వారసంతలో విక్రయించాలని గ్రామస్థులు చెప్పినా పట్టించుకోవడం లేదు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరువ తీసుకొని వారసంతను వినియోగంలోకి తీసుకరావాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అన్నారంలో నిరుపయోగంగా ఉన్న వారసంత

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌ను కలిసిన నాయకులు

కరీంనగర్ అర్బన్, జూలై13: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న రాష్ట్ర విభజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డిని శనివారం యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్ కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు కిమ్ ఫహద్, జీడి రవితేజ, జిల్లా అధికార ప్రతినిధి గట్టు ప్రశాంత్, జిల్లా కార్యదర్శి గజన్‌నాయక్, హరీష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌ను అభినందిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్

శంకరపట్నం, జూలై 13: ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపల్లి అరవింద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం ద్వారా నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. విద్యార్థుల సంక్షేమానికి, ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా ఉన్న సమస్యలను విద్యాధికారులు పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నిరంతర పర్యవేక్షణ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌సాగర్, మండల నాయకులు పాల్గొన్నారు.

ఎస్సై ఆత్మహత్యకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, జూలై 13: సీఐ జితేందర్‌రెడ్డి, కానిస్టేబుల్స్ వల్లనే అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నారని దళిత సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల చంద్రమౌళి ఆరోపించారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్‌ను మానసికంగా ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. సీఐని సస్పెండ్ చేసి ఆయన చావుకు కారణమైన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్, నూతన డీజీపీ చొరవ తీసుకొని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీనివాస్ కుటుంబానికి రూ. 50లక్షల నష్టపరిహారం చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కోరారు. దళిత ఉద్యోగులను ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే వారిపై చర్యలు తీసుకునేలా పార్లమెంట్‌లో కొత్త చట్టం తీసుకురావాలన్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినపుడు కాలయాపన చేస్తుంటే ఏమనుకోవాలని ప్రశ్నించారు. దళితులపై జరుగుతున్న దాడుల విషయంలో స్పందించకుంటే ఎంపీ, ఎమ్మెల్యేలుగా గెలిచి ఏం లాభమని అన్నారు. దళిత పోలీసు ఉద్యోగులు చనిపోకూడదని, పై అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. సమావేశంలో బోయినపల్లి చంద్రయ్య, కోండ్ర స్వరూప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల చంద్రమౌళి

ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థికి ఉద్యోగం

గణేశ్‌నగర్,జూలై 13: మానకొండూర్ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన రోడ్డ ఓం ప్రకాష్ నిరుపేద ఎస్సీ విద్యార్థి. తండ్రి వ్యవసాయం చేస్తూ చదివిస్తున్నారు, ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఇతను కరీంనగర్‌లోని ప్రభుత్వ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత కోచింగ్ తీసుకున్నాడు. ఐ.బీ.పీ.ఎస్ (ఆర్.ఆర్.బి) పరీక్ష ఉత్తీర్ణుడై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులో క్లర్క్ ఉద్యోగం సాధించాడు. ఓం ప్రకాష్‌ను డి.డి హమీద్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్, స్టాఫ్, ఫ్యాకల్టీ అభినందించారు.

బస్టాండ్‌ను పరిశీలించిన ఇన్‌చార్జి డీఎం

శంకరపట్నం, జూలై 13: శంకరపట్నం మండలంలోని కేశవపట్నం బస్టాండ్‌ను హుజూరాబాద్ ఇన్‌చార్జీ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో గ్రామపంచాయతీ సిబ్బంది మొరం పోశారన్న సమాచారం మేరకు బస్టాండ్ స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

యువకుడి నేత్రాలు సజీవం



సాయికుమార్

కరీంనగర్ రూరల్, జూలై13: మండలంలో బొమ్మకల్ గ్రామంలోని కృష్ణానగర్‌కు చెందిన పోలాడి సాయికుమార్ కరీంనగర్ కోతిరాంపూర్ వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించగా అతని కోరిక మేరకు తండ్రి పులాడి మహేందర్, అతని అన్నయ్య పోలాడి సందీప్ నేత్ర వైద్యశాల వైద్యులచే నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాలకు పంపించారు. ఈకార్యక్రమంలో కుటుంబ సభ్యులు, పురప్రముఖులు, యువకులు కొల అన్నా రెడ్డి, చింతల కిషన్, ఎలగందుల నందకుమార్, దేవరకొండ అజయ్, మామిడి కిరణ్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

సుభాష్‌నగర్, జూలై 13: మంకమ్మతోట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం క్లబ్ బాధ్యుడు మల్లికార్జున రాజేందర్, రజనిదేవి కుమారుడు రితిష్ జన్మదినం సందర్భంగా జిల్లా ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బూర్ల విద్యాసాగర్, కార్యదర్శి అంబటి రవీందర్‌రాజు, కోశాధికారి పాత విశ్వనాథం, మానేరు క్లబ్ ఎల్‌సీకే రావికంటి కృష్ణకిషోర్, బాలాజీనగర్ క్లబ్ ఎల్‌సీకే బద్దం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శాకంబరీ ఉత్సవాలు

కరీంనగర్ రూరల్, జూలై13: కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గభవానీ ఆలయంలో ఆలయ ధర్మాధికారి, వేద పండితులు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆషాడ శాకాంబరీ ఉత్సవాల్లో బాగంగా శనివారం అమ్మవారిని క్యారెట్ మాలలతో అలంకరించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి విశేషాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన వితరణ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్, కార్పొరేటర్, వంగల శ్రీదేవి, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

డీఎస్సీ హాల్ టికెట్‌లో మారిన జిల్లా

వీణవంక, జూలై 13: వీణవంక మండలం కోర్కల్ గ్రామానికి చెందిన పోరెడ్డి సౌజన్య డీఎస్సీలో బయలాజికల్ సైన్స్ పోస్టుకు దరఖాస్తు చేసింది. కరీంనగర్ జిల్లా నుంచి దరఖాస్తు చేసుకోగా, హాల్‌టికెట్‌లో మాత్రం ఖమ్మం జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్నట్లు వచ్చింది. డీఎస్సీ పరీక్ష కోసం ఎంతో కాలంగా సిద్ధమవుతున్న తనకు హాల్‌టికెట్ తప్పుగా రావడం ఆందోళన కలిగిస్తుందని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి హాల్‌టికెట్‌లో దొర్లిన తప్పులను వెంటనే సరిచేయాలని కోరారు.

గానకోకిల అవార్డు అందజేత

హుజూరాబాద్‌రూరల్,జూలై13: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన కళాకారుడు పుల్ల వెంకన్న జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఉద్యమ గాన కోకిల అవార్డును ఉత్తర తెలంగాణ పీపుల్స్ మోమెంట్ అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ముక్కెర సంపత్‌కుమార్ నుంచి అందుకున్నారు.

సెయింట్ జార్జ్ విద్యార్థి ప్రతిభ



హస్నితను అభినందిస్తున్న ఫాతిమారెడ్డి

భగత్‌నగర్, జూలై 13: కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్(సిబిఎస్ఈ)లో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థి హస్నిత ఫైరింగ్ క్యాంప్‌లో ఉత్తమ ప్రతిభ చాటి టిఆర్‌జి-1కు ఎంపికయ్యింది. శనివారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో హస్నితకు పాఠశాల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డిప్రశంసా పత్రంతో పాటు, పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

బీరుసీసాలో పురుగు



బీరులో వచ్చిన పురుగు

హుజూరాబాద్, జూలై 13: హుజూరాబాద్ పట్టణంలోని ఓ వైన్స్ షాపులోని బీరు సీసాలో శనివారం పురుగు వచ్చింది. వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన సంపత్ బీరు తీసుకొని తాగుతుండగా పురుగు కనబడింది. ఇది గమనించిన సంపత్ వైన్ షాపునకు వెళ్లి విషయం తెలిపాడు. బీరుల్లో ప్రాణం తకమైన జీవులు వస్తున్నా సంబంధిత ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

రామడుగు, జూలై 13 : మండలంలోని గుండి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త దురిశెట్టి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని శనివారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. నాయకులు ఉన్నాం రాజమల్లయ్య, మడ్డి శ్యామ్, శిరోద్దీన్, తిరుపతి, భూమయ్య, అంజయ్య తదితరులు ఉన్నారు.

గౌడ సంఘం మండల కమిటీ ఎన్నిక

వీణవంక, జూలై 13: వీణవంక మండల సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక మండల నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులు తిప్పని సమ్మయ్య, ఉపాధ్యక్షులు రమేష్, సదానందం, మొగిలి, ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రాజమల్లు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు 'గ్రేయిన్ చైన్స్ పుస్తకం' ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, జూలై 13: జిల్లాకు చెందిన కవి అన్నవరం దేవేందర్ 2016-2018 మధ్య రాసిన కవిత్వం వరిగొలుసులు కవితా సంపుటిని కవి, సవ్యసాచి గ్రేయిన్ చైన్స్ పేర ఆంగ్లంలోకి అనువదించారు. అన్నవరం దేందర్ కవిత్వంలోని తెలంగాణ భాషాసొగబులు, ఉద్యమ నేపథ్యాలకు ఇష్టపడి అనువాదం చేయాలనిపించి చేశానని సవ్యసాచి తెలిపారు. అన్నవరం దేవేందర్ సాహిత్య జీవితంలో ఇది 3వ ఇంగ్లీష్ అనువాద కవితా సంపుటి.